సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

గురువారం । 7 । డిసెంబర్ । 2023



దివ్యాంగులకు డిజిటల్ బోధన

ప్రభుత్వం దివ్యాంగులకు నాణ్యమైన విద్యను అందించే దిశగా పాఠశాలల్లో డిజిటల్ విద్యకు ప్రాధాన్యమిస్తోంది.

8లో



పాక కూలి వృద్ధుడి మృతి

మండల పరిధిలో జి.మేడపాడు ఎస్సీ కాలనీలో ఒక పాక కూలి పోవడంతో మంచంపై నిద్ర పోతున్న వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు.

మిగులు జలాలు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం 1,03,111 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రం లోకి విడుదల చేశారు. తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు నీటి విడుదలను పూర్తిగా నిలిపివేశారు.

న్యూస్‌రీల్

క్రైసిస్ మేనేజ్‌మెంట్ ఫెసిలిటీ కల్పించాలి

లోక్‌సభలో ఎంపీ అనురాధ



అల్లవరం: కోనసీమ జిల్లాలో చమురు కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఓఎన్‌జీసీ, గెయిల్, రిలయన్స్ సంస్థల నిర్లక్ష్యం వల్ల తరుచు ప్రమాదాలు జరుగుతున్నాయని ఎంపీ చింతా అనురాధ లోక్‌సభలో బుధవారం ప్రస్తావించారు. ఈ సంస్థలు గ్యాస్‌ని సరఫరా చేస్తున్నాయని, నిర్వహణ లోపం, దీర్ఘకాలికంగా పైపులు మార్చకపోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయని అన్నారు. ప్రజల భద్రతకు, తరచుగా లీకేజీల కారణంగా తలెత్తుతున్న ప్రమాదాల నుంచి రక్షణకు క్రైసిస్ మేనేజ్‌మెంట ఫెసిలిటీని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని ఎంపీ అనురాధ కోరారు. జిల్లాలో గెయిల్‌కు 430 కిలోమీటర్ల పొడవునా, ఓఎన్‌జీసీ 120, రిలయన్స్‌కు 36 కిలోమీటర్ల పొడవునా పైపులైన్లు ఉన్నాయని తెలిపారు. గతంలో అనేకసార్లు పైపులైన్ల నుంచి గ్యాస్, చమురు లీకేజీలు జరిగి పరిసర ప్రాంతాల్లోని ప్రజలు నష్టపోయారని తెలిపారు. దీనిపై సమగ్రంగా అధ్యయనం చేసి క్రైసిస్ మేనేజ్‌మెంట్ ఫెసిలిటీని ఏర్పాటుచేసి ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు భద్రత కల్పించాలని కోరారు.

సవరణ... కొత్త ఓటర్లకు 12,221 దరఖాస్తులు



రాజకీయ పార్టీ నాయకులతో మాట్లాడుతున్న డీఆర్వో సత్తిబాబు

సాక్షి అమలాపురం: జిల్లా వ్యాప్తంగా ఓటరు నమోదు, సవరణల కోసం 1,644 పోలింగ్ కేంద్రాలలో ఫారం-6, 7, 8 దరఖాస్తులు 12,221 వచ్చాయని డీఆర్వో సీహెచ్ సత్తిబాబు తెలిపారు. ఈ నెల 2,3 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించగా పలువురు దరఖాస్తులు చేసుకున్నారని ఆయన వివరించారు. డిసెంబర్ 9 వరకు మూడు రకాల దరఖాస్తులను స్వీకరిస్తామని, తదుపరి దరఖాస్తులను డిసెంబర్ 24 లోపు పరిష్కరిస్తామని డీఆర్వో తెలిపారు. కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. గత వారంలో చేపట్టిన ఓటర్ జాబితా సవరణకు సంబంధించిన వివరాలను ఆయన వారికి తెలిపారు. డీఆర్వో మాట్లాడుతూ జిల్లాలో ప్రత్యేక ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణకు సంబంధించి ఓటరు జాబితా పరిశీలకులు, పరిశ్రమల శాఖ కమిషనర్ యువరాజు జిల్లాకు రానున్నారన్నారు. గురువారం సాయంత్రం ఓటర్ జాబితా పరిశీలకులు జిల్లాకు రానున్న నేపథ్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు సంప్రదించవచ్చునన్నారు. ఈ నెల ఏడో తేదీ నుంచి ఈవీఎంలపై గ్రామ గ్రామాన ఓటర్లకు అవగాహన పెంపొందించే కార్యక్రమాలు ప్రారంభమవుతాయని వివరించారు. ఒక్కొక్క అసెంబ్లీ నియోజకవర్గానికి శిక్షణ కోసం 12 చొప్పున ఈవీఎంలు కేటాయిస్తామన్నారు. వైఎస్సార్ సీపీ పట్టణ పార్టీ అధ్యక్షుడు సంసాని నానితోపాటు పలువురు పాల్గొన్నారు.

ప్రపంచ మేధావులలో అంబేడ్కర్ ఒకరు



అంబేడ్కర్‌కు నివాళి అర్పిస్తున్న జిల్లా ప్రత్యేక అధికారి జయలక్ష్మి, కలెక్టర్ హిమాన్షు శుక్లా, జేసీ నుపూర్ అజయ్, డీఆర్వో సత్తిబాబు

సాక్షి అమలాపురం: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ప్రపంచ మేధావుల్లో అగ్రగణ్యులని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి తుపాను సహాయక చర్యల ప్రత్యేక అధికారి జి.జయలక్ష్మి అన్నారు. అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకొని కలెక్టరేట్‌లో కలెక్టర్ హిమాన్షు శుక్లా, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్‌లతో కలిసి ఆమె నివాళి అర్పించారు. అంబేడ్కర్ కాంస్య విగ్రహానికి పూలమాలు వేశారు. ఆమె మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలను, భావజాలాన్ని ముందుకు తీసుకు వెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కలెక్టర్ శుక్లా మాట్లాడుతూ అంబేడ్కర్ అంటరానితనాన్ని వ్యతిరేకిస్తూ దళితులు, మహిళలు, కార్మికుల హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేసిన యోధుడన్నారు. డీఆర్వో సీహెచ్ సత్తిబాబు, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి పి.జ్యోతిలక్ష్మి దేవి, కలెక్టరేట్ పరిపాలనాధికారి కాశీ విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

వాన.. 'లోటు' తీరేలా..

- కోనసీమ జిల్లాలో రికార్డు స్థాయి వర్షం
- 24 గంటలలో 149.8 మిల్లీమీటర్లు
- ముంచేసిన మిచాంగ్
- నీట మునిగిన ఇళ్లు, రోడ్లు, పంట చేలు
- వరికి పెరిగిన నష్ట తీవ్రత
- వర్షాలు తెరపి ఇవ్వడంతో జోరందుకున్న సహాయక చర్యలు
- ముంపు నివారణ చర్యలలో వలంటీర్ల భాగస్వామ్యం



అయినవిల్లి మండలం మాగాంలో ముంపునీటి మళ్లింపు పనులు పరిశీలించడానికి వచ్చిన జిల్లా ప్రత్యేకాధికారి జయలక్ష్మి, కలెక్టర్ హిమాన్షు శుక్లా



అమలాపురం హౌసింగ్ బోర్డు కాలనీలో ఇంటిలో చేరిన వాన నీరు తోడుకుంటున్న దృశ్యం





మామిడికుదురులో ముంపు నీటిలో నానుతున్న వరి పనలు, ముంపునకు గురైన నారుమడి

సాక్షి అమలాపురం: నైరుతి ముఖం చాటేసింది... ఈశాన్యం జాడలేకుండా పోయింది. జిల్లాలో జూన్ నెల నుంచి నవంబర్ నెలాఖరు వరకు ప్రతి నెలా లోటు వర్షమే. కాని మిచాంగ్ తుపాను కారణంగా లోటు తీరేలా వర్షం కురిసింది. అవసరమైనప్పుడు ముఖం చాటేసిన వర్షం... అవసరం లేని సమయంలో కుండపోతగా కురిసింది. కోతలు పూర్తికాని చోట రైతులను ఇబ్బందుల పాల్జేసింది.

జిల్లాలో మిచాంగ్ తుపాను ప్రభావం వల్ల మంగళవారం రాత్రి కుంభవృష్టి వర్షం కురిసింది. సముద్ర హోరుగాలి, భారీ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం ఎడతెరపి లేకుండా పది గంటల పాటు ఏకధాటిగా పడింది. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి బుధవారం ఉదయం 8 గంటల వరకు జిల్లా వ్యాప్తంగా సగటున 149.8 మిల్లీమీటర్ల వర్షం కురవడం గమనర్హాం. ఈ ఏడాదిలో ఇది రికార్డు స్థాయి వర్షం అని చెప్పాలి. అత్యధికంగా ఆత్రేయపురం మండలంలో 200.2 మిల్లీమీటర్లు కాగా, అత్యల్పంగా ఐ.పోలవరంలో 72.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఇంచుమించు ప్రతి మండలంలోనూ 100 మిల్లీమీటర్లు దాటి వర్షం కురవడం విశేషం. భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో కాలనీలు నీట మునిగాయి. అమలాపురంలో హౌసింగ్ బోర్డు కాలనీ ఇళ్లలోకి నీరు చేరింది. ఎస్పీ కార్యాలయం రహదారితోపాలు పలు రహదారులపై మోకాలు లోతు నీరు చేరింది. జిల్లాలోని పలు గ్రామాల్లో లోతటు ప్రాంతాల కాలనీలు సైతం ముంపులో చిక్కుకున్నాయి. ప్రధాన మురుగునీటి కాలువలు పోటెత్తుతున్నాయి. విద్యుత్ స్తంభాలు పడిపోవడం, లైన్లు తెగిపోవడంతో సరఫరాకు అవాంతరం ఏర్పడింది.

వరి చేలల్లో పెరిగిన ముంపు

తుపాను ప్రభావం వల్ల మంగళవారం అర్ధరాత్రి కురిసిన వర్షం వల్ల వరి రైతులు అధికంగా దెబ్బతిన్నారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కుంభవృష్టి వర్షం తోడవ్వడంతో ముంపుతీవ్రత మరింత పెరిగింది. జిల్లాలో తుపాను మొదలయ్యే సరికి 51,608 ఎకరాల్లో కోతలు జరగాల్సి ఉంది. ఇవన్నీ భారీ వర్షాల బారిన పడ్డాయి. ముమ్మిడివరం, కాట్రేనికోన, అల్లవరం, ఉప్పలగుప్తం, మామిడికుదురు, మలికిపురం, సఖినేటిపల్లి, రాజోలు, అమలాపురం మండలాల్లోని వరిచేలల్లో ముంపుతీవ్రత అధికంగా ఉంది. కాట్రేనికోన, ఉప్పలగుప్తం, అల్లవరం మండలాల్లోని తీర గ్రామాల్లో చేలు చెరువులను తలపిస్తున్నాయి. 30 శాతం చేలు అంటే సుమారు 15 వేల ఎకరాలు పడిపోగా, 12 వేల ఎకరాల్లో ముంపుబారిన పడ్డాయని ప్రాథమిక అంచనా. రైతులు ఒబ్బిడి చేసుకున్న ధాన్యం రాశుల దిగువకు నీరు వచ్చి చేరింది. వాన తెరపి ఇవ్వడంతో రైతులు కళ్లాలోని ధాన్యాన్ని తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు. ఉద్యాన పంటలైన కొబ్బరి, అరటి, కంద, కూరగాయలు, పువ్వుల తోటలలో సైతం ముంపునీరు చేరింది. అయితే వీటికి పెద్దగా నష్టం ఉండదని అధికారులు చెబుతున్నారు.

వేగంగా సాగుతున్న సహాయక చర్యలు

▸▸ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ హిమాన్షు శుక్లా జిల్లాలో తుపాను పరిస్థితి వివరించారు. చేపట్టిన సహాయ పునరావాస కార్యక్రమాలను వివరించారు. ముంపు బాధితులను, రైతులను ఆదుకునే విషయంలో మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సీఎం జగన్ సూచించారు.

▸▸ మిచాంగ్ తుపాను ప్రభావం తగ్గడంతో బుధవారం ఉదయం నుంచి భారీ వర్షాలకు తెరపి ఇచ్చింది. మధ్యాహ్నం నుంచి ఎండకాయడం మొదలైంది. దీంతో సహాయ పునరావాస చర్యలు, కాలనీలు, చేలల్లో ముంపు తొలగించే చర్యలను అధికారులు వేగం చేశారు. అమలాపురం మున్సిపాలిటీతోపాటు పలు గ్రామాల్లో రోడ్లకు అడ్డుగా పడిన చెట్లను తొలగిస్తున్నారు. మున్సిపాలిటీలు, గ్రామాల్లో డ్రైనేజీల్లో సిల్ట్ తొలగింపు పనులు చేపట్టి ముంపునీరు వేగంగా దిగేలా చూస్తున్నారు. మున్సిపల్, పంచాయతీ సిబ్బంది శానిటేషన్ పనులు వేగవంతం చేశారు.

▸▸ వరి చేలల్లో మంపునీరు దిగేందుకు ఉపాధి హామీ పథకం కూలీలు డ్రెయిన్లలో పూడిక తొలగింపు పనులు చేపట్టారు. పలుచోట్ల జేసీబీలతో తూడు తొలగించారు. అడ్డుగా ఉన్న చెత్తా చెదారాన్ని తొలగించి వేగంగా మురుగునీరు దిగేలా చర్యలు చేపట్టారు.

▸▸ కూనవరం డ్రెయిన్ మొగ వద్ద ముంపునీరు దిగేందుకు వీలుగా డ్రెడ్జింగ్ పనులు చేపట్టారు. దీంతో సుమారు 25 వేల ఎకరాల ఆయకట్టు పరిధిలో ముంపునీరు వేగంగా సముద్రంలోకి దిగనుంది. అయినవిల్లి మండలం మాగాంలో దెబ్బతిన్న వరిచేలను కలెక్టర్ హిమాన్షు శుక్లా, జిల్లా ప్రత్యేకాధికారి జయలక్ష్మి బుధవారం పరిశీలించారు.

బాధితులకు భోజనాలందించిన వలంటీర్లు

▸▸ తుపాను ముంపు తొలగింపు చర్యలలో వార్డు, గ్రామ వలంటీర్లు చురుకుగా వ్యవహరించి ప్రశంసలందుకుంటున్నారు. అమలాపురం పట్టణంలో హౌసింగ్ బోర్డు కాలనీతోపాటు పలు కాలనీలు ముంపుబారిన పడ్డాయి. ఇళ్లలోకి నీరు చేరింది. వలంటీర్లు ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకుని వెళ్లి ముంపునీరు దిగేందుకు తమ వంతు సహాయం అందించారు. పట్టణంలోని 11, 14, 28, 29 వార్డులలో ముంపు బాధితులకు వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు భోజనాలు అందించారు.

▸▸ వర్షాలలో సహితం ధాన్యం కొనుగోలు నిర్విఘ్నంగా సాగుతోంది. 17 శాతానికి మించి తేమ ఉన్నా రైతుల వద్ద నుంచి కొనుగోలుకు పౌరసరఫరాల శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. తుపాను మొదలైన తరువాత ఈ నెల 3వ తేదీ నుంచి ఈ రోజు వరకు 14,278 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు పౌరసరఫరా శాఖ జిల్లా అధికారి సుధాసాగర్ తెలిపారు.

మూడు రోజులలో ముంచేసిన వర్షాలు

జిల్లాలో మండలాల వారీగా డిసెంబర్ నెలలో కురిసిన వర్షం (మి.మీటర్లలో)

మండలం	6వ తేదీ	1 నుంచి 6వ తేదీ వరకు
ఆత్రేయపురం	200.2	269.8
మండపేట	161.4	228.5
రాయవరం	130.6	203.5
రామచంద్రపురం	163.6	249.3
ఆలమూరు	129.6	242.1
రావులపాలెం	189.2	328.6
కొత్తపేట	140.4	308.1
కపిలేశ్వరపురం	100.2	245.4
కె.గంగవరం	146.2	301.3
ఐ.పోలవరం	72.6	268.1
ముమ్మిడివరం	114.0	332.4
అయినవిల్లి	178.6	411.5
పి.గన్నవరం	177.4	286.2
అంబాజీపేట	144.2	309.3
మామిడికుదురు	145.2	268.1
రాజోలు	173.8	284.5
మలికిపురం	198.0	326.7
సఖినేటిపల్లి	166.2	309.4
అల్లవరం	169.2	304.6
అమలాపురం	194.6	401.2
ఉప్పలగుప్తం	111.4	333.9
కాట్రేనికోన	88.6	277.9
జిల్లా సగటు	149.8	295.1



కొత్తపేట మండలం పూజారిపాలెంలో ముంపు బాధితులకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి



మలికిపురం మండలం రామరాజులంకలో వరి చేలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు



ఉప్పలగుప్తంలో భారీ వర్షాలకు తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తున్న అధికారులు

ఎమ్మెల్యే చిట్టిబాబు చొరవతో
రైతులకు తప్పిన నష్టం



రైతులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

పి.గన్నవరం: మిల్లుకు తరలిస్తున్న ధాన్యం లోడు ట్రాక్టర్ పంట కాలువలో పడి, ధాన్యం బస్తాలు నీటి పాలైన నేపథ్యంలో ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు చొరవతో రైతులకు నష్టం లేకుండా బుధవారం అధికారులు ధాన్యం సొమ్మును అందించారు. ఈ నెల 3న మండలంలోని జి.పెదపూడికి చెందిన ముగ్గురు రైతుల నుంచి ఆర్‌బీకే ద్వారా కొనుగోలు చేసిన 100 క్వింటాళ్ల ధాన్యం బస్తాలను రాజోలు మండలం శివకోడు గ్రామంలోని రైసుమిల్లుకు ట్రాక్టర్‌పై తరలిస్తున్నారు. వర్షాల నేపథ్యంలో శివకోడు వద్ద ట్రాక్టర్ పంట కాల్వలో పడిపోయింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చిట్టిబాబు తహసీల్దార్ రవీంద్రనాథ్ ఠాగూర్ ద్వారా కలెక్టర్ శుక్లాకు సమాచారం అందించి, రైతులను ఆదుకోవాలని కోరారు. దీంతో కలెక్టర్ ఆదేశాలతో తడిసిన బస్తాలను మిల్లుకు తరలించి, రైతులకు నష్టం లేకుండా రూ.2.24 లక్షలను మంజూరు చేశారు. ఈ చెక్కులను స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో చిట్టిబాబు ముగ్గురు రైతులకు బుధవారం అందజేశారు. దీంతో కలెక్టర్, ఎమ్మెల్యే, తహసీల్దార్‌లకు రైతులకు కృతజ్ఞతలు తెలిపారు. చిట్టిబాబు మాట్లాడుతూ వర్షానికి తడిసిన ప్రతీ ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందవద్దని విజ్ఞప్తి చేశారు. జెడ్పీ సీఈఓ రమణారెడ్డి, డీటీ బి.గోపాలకృష్ణ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు చెల్లుబోయిన శ్రీనివాస్, దొమ్మేటి దుర్గారావు, కొక్కిరి రవికుమార్, పినిశెట్టి శ్రీనివాస్, యువరాజు, పండు పాల్గొన్నారు.

కూరగాయల ధరలకు రెక్కలు



కూరగాయల దుకాణం

అమలాపురం టౌన్: తుపాను కారణంగా మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల ప్రభావం లంక గ్రామాల్లో పండించే కాయగూరల పంటలపై పడింది. ఫలితంగా కూరగాయల ధరలు పెరిగాయి. అన్ని రకాల కూరగాయలపై రూ.10 నుంచి రూ.20 ధరల పెరుగుదల కనిపిస్తోంది. అయినవిల్లి, పి.గన్నవరం, ఆలమూరు, కొత్తపేట, రావులపాలెం, మామిడికుదురు తదితర మండలాల గోదావరి లంక భూముల్లో రైతులు దాదాపు ఆరు వేల ఎకరాల్లో కూరగాయలు పండిస్తున్నారు. ఆకు కూరలు కూడా సాగు చేస్తున్నారు. భారీ వర్షాలకు కూరగాయల తోటలు ముంపునకు గురయ్యాయి. జిల్లాలో ఉన్న దాదాపు 650 కూరగాయల దుకాణాలకు లోకల్ పంటగా పై మండలాల నుంచి రోజుకు సుమారు 250 టన్నుల కూరగాయలు ఉత్పత్తి అవుతాయి. దొండ, బీర, వంకాయ, చిక్కుడు, బెండ, పచ్చిమిర్చి, కంద తదితర కూరగాయలతో పాటు తోటకూర, గోంగూర, మెంతి, పాల, బచ్చలి తదితర ఆకు కూరల పంటలు చాలా వరకూ దెబ్బతిన్నాయి. అధిక వర్షాల కారణంతోపాటు రవాణా సమస్యలు కూడా తోడై కూరగాయలకు కొంత డిమాండ్ పెరిగి సహజంగానే ధరలపై కొంత ప్రభావం పడింది. మొన్నటి వరకూ కిలో రూ.40 పలికిన వంకాయల ధర ఇప్పుడు వర్షాలతో రూ.60కి చేరింది. రూ.20 ఉన్న కిలో బెండ కాయల ధర రూ.40 పలుకుతోంది. కిలో చిక్కుడు రూ.30 నుంచి రూ.50 అయింది. పచ్చిమిర్చి, బీర, దొండ ఇలా పలు రకాల కూరగాయల కిలో ధరలో రూ.10 నుంచి రూ.20 వరకూ పెరుగల అనివార్యమైంది. లోకల్ పంట లేక అసలే గిరాకీ ఉన్న కిలో ఉల్లి ధర మొన్నటి వరకూ రూ.50 పలికితే ఇప్పుడు రూ.60 అయింది. బుధవారం మార్కెట్లో ఆకు కూరలు కనిపించకుండా పోయాయి.

కుల గణనతో బీసీల సామాజికాభివృద్ధి

రౌండ్ టేబుల్ సమావేశంలో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు



బీసీ కుల గణనపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: ఎన్నో దశాబ్దాల నుంచి అడుగుతున్న బీసీ కుల గణన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు చేపడుతుండడం ఓ చారిత్మాత్మక పరిణామమని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ రావు అన్నారు. కుల గణనతో బీసీలకు సామాజికాభివృద్ధి మరింత సాకారం అవుతుందని ఆయన ఆకాంక్షించారు. అమలాపురం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బీసీ కుల గణనపై బుధవారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఎమ్మెల్సీ సూర్యనారాయణ రావు మాట్లాడారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడుతో పాటు పలు బీసీ కులాలకు చెందిన ప్రతినిధులు, కౌన్సిలర్లు హాజరై ఈ అంశంపై చర్చించారు. కుల గణన జరిగితే బీసీలకు సంపూర్ణ సహకారంతోపాటు సామాజిక న్యాయం కూడా సాధ్యమవుతుందని పలువురు బీసీ నేతలు అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా బీసీ కుటుంబాల్లోని విద్యార్థులకు రిజర్వేషన్లు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మరింత మెరుగు పడతాయని పేర్కొన్నారు. ఇన్నాళ్లూ బీసీ కులాలకు శాస్త్రీయమైన విధి విధానాలు, ప్రణాళిక, గణంకాలు లేకపోవడంతో ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే కుల గణనతో ఓ స్పష్టత వస్తుందన్నారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, బీసీ నాయకులు, కౌన్సిలర్లు సంసాని బులినాని, చిట్టూరి పెదబాబు, గొవ్వాల రాజేష్, కట్టోజు సన్నయ్యదాసుతోపాటు బీసీ కులాలకు చెందిన ప్రతినిధులు సమావేశంలో తమ అభిప్రాయాలు, సూచనలు వెల్లడించారు. మున్సిపాలిటీ బీసీ ప్రతినిధుల నుంచి అభిప్రాయ సేకరణ కూడా చేసింది.

మాంసం దుకాణాల తనిఖీ



తనిఖీలు చేస్తున్న లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ రాజేష్

సాక్షి అమలాపురం: చికెన్, మటన్ అమ్మకాలు చేసే దుకాణాలపై లీగల్ మెట్రాలజీ శాఖ బుధవారం విస్తృతంగా తనిఖీలు చేసింది. జిల్లాలో ముమ్మిడివరం, మురముళ్ళ, పాత ఇంజరం, ఐ.పోలవరం, రామచంద్రపురంలో ఈ తనిఖీలు చేశారు. ఈ తనిఖీలలో భాగంగా చికెన్, మటన్ అమ్మకాలలో ఉపయోగిస్తున్న ఎలక్ట్రానిక్ కాటాలను పరిశీలించారు. కొన్ని షాపులలో ఉన్న కాటాలలో తూకాలలో తేడాలను గుర్తించామన్నారు. కేజీకి 100 గ్రాముల నుంచి 250 గ్రాముల వరకూ తేడా ఉన్నట్టు గుర్తించి ఎనిమిది కేసులు నమోదు చేశామని అసిస్టెంట్ కంట్రోలర్ కె.రాజేష్ తెలిపారు. వ్యాపారస్తులు తూకాలలో మోసాలకు పాల్పడినట్లయితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వినియోగదారులు టోల్ ఫ్రీ నంబర్ 18004254202 లేదా 1967కు ఫోన్ చేయాలన్నారు. ఈ తనిఖీలలో ఇన్‌స్పెక్టర్లు జి.వి.ప్రసాద్, టి.కుటుంబరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పాక కూలి వృద్ధుడి మృతి



మంచంపై ఉన్న నాగరాజుపై కూలిన పాక



మృతుడు నాగరాజు (పాత చిత్రం)

సామర్లకోట: మండల పరిధిలో జి.మేడపాడు ఎస్సీ కాలనీలో ఒక పాక కూలి పోవడంతో మంచంపై నిద్ర పోతున్న వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. తుపాను కారణంగా మూడు రోజులుగా కురిసిన వర్షాలకు పాక తడిసిపోయింది. బుధవారం ఈదురు గాలికి పాక కూలి మంచంపై పడడంతో ముక్కుర్తి నాగరాజు (62) మృతి చెందాడు. వైఎస్సార్ సీపీ నాయకుడు మోరంపూడి శ్రీరంగనాయకులు ఫిర్యాదు మేరకు తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి వీఆర్వోలు, గ్రామ పెద్దలు ఘటనా ప్రదేశానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

లారీ ఢీ కొని నర్సు మృతి



ఘటనా స్థలిలో పడిపోయిన సత్యవతిని పైకి లేపుతున్న స్థానికులు

సామర్లకోట: లారీ ఢీకొనడంతో నర్సు మృతి చెందింది. స్థానిక గరువులో నివాసం ఉంటున్న నర్సు దొమ్మేటి సత్యవతి (31) బుధవారం మధ్యాహ్నం స్కూటీపై కాకినాడ వెళుతుండగా వెనుక నుంచి లారీ ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడింది. స్థానికులు ఆమె బంధువులు సత్యవతిని హుటాహుటిన ఏడీబీ రోడ్డులోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకొని వెళుతుండగా ఆస్పత్రికి చేరే సమయానికి మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు కథనం ప్రకారం దొమ్మేటి సత్యవతి కాకినాడ జీజీహెచ్‌లో నర్సుగా పని చేస్తోంది. విధులకు హాజరు కావడానికి స్కూటీపై వెళుతూ ఉండగా స్థానిక స్టేషన్ సెంటర్‌లో వెనుక నుంచి వచ్చిన లారీ బలంగా స్కూటీని ఢీ కొంది. డ్రైవరు నిర్లక్ష్యం కారణంగా ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగులకు డిజిటల్ బోధన

- విద్యార్థులతో పాటు ఐఈఆర్‌టీ, స్పెషల్ టీచర్లకు ట్యాబ్స్
- మొదటి విడతగా 160 మందికి పంపిణీ
- విషయం అర్థమయ్యేలా 26 ప్రత్యేక యాప్‌లు
- వినియోగంపై త్వరలో ఒక రోజు ఓరియంటేషన్



దివ్యాంగ చిన్నారికి బోధన చేస్తున్న ఐఈఆర్‌టీ ఉపాధ్యాయురాలు



విభిన్న ప్రతిభావంతుడైన విద్యార్థికి ఫిజియో థెరపీ సేవలు అందజేస్తున్న వైద్యుడు

రాయవరం: ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే దిశగా పాఠశాలల్లో డిజిటల్ విద్యకు ప్రాధాన్యమిస్తోంది. ఇప్పటికే పలు పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్, స్మార్ట్ టీవీలను అందించగా, గత విద్యా సంవత్సరంలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్స్‌ను అందజేసింది. సాధారణ విద్యార్థులతో పాటు, విభిన్న ప్రతిభావంతులకు కూడా డిజిటల్ విద్యను అందించే దిశగా అడుగులు వేస్తోంది. విభిన్న ప్రతిభావంతుల జీవితాల్లో వెలుగులు నింపి, వారి కలలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే దివ్యాంగ చిన్నారులకు భవిత కేంద్రాల్లో ఫిజియోథెరపీ చేయించడం, పై చదువులు అభ్యసించేలా 10 మార్కుల ఉత్తీర్ణత కొలమానం చేయడం, సహిత విద్యను అందించేందుకు రీసోర్స్ పర్సన్లు, బాగోగులు చూసేందుకు ఆయాలను నియమించడంతో పాటు, తాజాగా భవిత కేంద్రాల్లో అత్యాధునిక ట్యాబ్స్‌ను అందజేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో ఉన్న 22 భవిత కేంద్రాల్లో చదువుతున్న విద్యార్థులకు, వారికి బోధన చేసే ఐఈఆర్‌టీలు, స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లకు కూడా డిజిటల్ విద్యను అందించే క్రమంలో ట్యాబ్స్‌ను అందజేసింది.

సత్సంకల్పంతో..

జిల్లాలో 22 భవిత కేంద్రాల్లో 465 మంది విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులు చదువుతున్నారు. శారీరకంగా, మానసికంగా ఎదుగుదల లేని వారికి అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోంది. మానసిక వైకల్యం ఉన్న విద్యార్థులకు రూ.14వేల విలువైన ఎంఆర్ కిట్లు, అత్యాధునిక హియరింగ్ పరికరాలు, ట్రై సైకిళ్లు, బైక్‌లు, మధ్యాహ్న భోజనంతో పాటు బస్‌పాస్‌లు, వారానికి ఒక రోజు ఫిజియో థెరపీ, నడవలేని స్థితిలో ఉన్నవారికి ఇంటి దగ్గరే విద్య, వైద్య సేవలు, నెల నెలా గర్ల్స్ స్టైపెండ్ పేరిట రూ.200, హోమ్ బేస్డ్ అలవెన్స్‌గా నెలకు రూ.300, రీడర్ అలవెన్స్‌గా రూ.300, ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్‌గా రూ.300, ఎస్కార్ట్ అలవెన్స్ రూ.300 నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. తాజాగా మూగ, వినికిడి, దృష్టి లోపంతో పాటుగా పూర్తిగా కనబడని వారు సైతం సాధారణ విద్యార్థుల్లా ఉన్నత విద్యను చదవాలనే ఉద్దేశంతో వారికి ఆధునిక సాంకేతికతతో కూడిన 160 ట్యాబ్స్‌ను ప్రభుత్వం అందజేసింది. విద్యార్థులతో పాటుగా, వారికి బోధించే ఉపాధ్యాయులకు కూడా ట్యాబ్స్‌ను అందజేసింది. వీటి వినియోగంపై త్వరలోనే జిల్లా వ్యాప్తంగా ఒక రోజు ఓరియంటేషన్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

విభిన్న ప్రతిభావంతుల్లో వెలుగులు నింపేలా..

6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న దృష్టి, వినికిడి లోపం ఉన్న విద్యార్థులకు ట్యాబ్స్‌లో ఆధునికమైన కంటెంట్‌ను నిక్షిప్తం చేశారు. బీ మై ఎస్, ఎన్ విజన్ ఆల్, గూగుల్ ట్రాన్స్‌క్రైబ్, గూగుల్ అవుట్ లుక్, డాక్స్, నీట్, జీ బోర్డు, నోట్ ప్యాడ్, గూగుల్ కీ తదితర ప్రత్యేకతలు ఉన్న కంటెంట్‌ను ట్యాబ్స్‌లో పొందుపర్చారు. పూర్తిగా చూపులేని వారికి, పాక్షిక అంధులకు, బధిరులు, పాక్షిక బధిరులకు వీలుగా టాక్ బ్యాక్(ట్యాబ్‌ను ఏ వైపు ఉపయోగించినా స్పందించే యాప్), స్పోకెన్ అసిస్టెంట్ (శబ్ద సాంకేతికతల ద్వారా ట్యాబ్‌ను ఉపయోగించే యాప్), విజిబులిటీ ఇనుస్ట్రుమెంట్), దృష్టి లోపం ఉన్న వారికి చిన్న చిన్న విషయాలను స్పష్టంగా చూడడానికి ఉపయోగించే యాప్, మిషన్ ఏఐ, ×ఎన్ే విజన్ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పనిచేసే) తదితర ప్రత్యేకంగా రూపొందించిన 26 యాప్‌లను ట్యాబ్స్‌లో పొందుపర్చారు. ట్యాబ్‌లను ఇతర అవసరాలకు ఉపయోగించుకోకుండా ప్రత్యేక లాక్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశారు. ఒక్కో ట్యాబ్ విలువ రూ.29వేలు ఉండగా, వీటికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కీ బోర్డు విలువ రూ.8వేలు ఉంటుంది. మొత్తంగా ఒక్కో ట్యాబ్ విలువ రూ.37వేలు.

జిల్లాలో భవిత కేంద్రాలు	22
విద్యార్థులు	465
ఐఈఆర్‌టీలు	44
ఎస్ఏ స్పెషల్ ఎడ్యుకేషన్	25
ఫిజియోథెరపిస్ట్‌లు	02
ఆయాలు	22

ట్యాబ్‌ల పంపిణీ ఇలా..

ఐఈఆర్‌టీలు	27
ఎస్ఏ స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లు	25
వినికిడి లోపం ఉన్న విద్యార్థులు	60
దృష్టి లోపం ఉన్న విద్యార్థులు	48

విప్లవాత్మకమైన చర్యలు



ప్రభుత్వం దివ్యాంగుల విద్య విషయంలో విప్లవాత్మకమైన నిర్ణయాలు తీసుకుంటోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు డిజిటల్ విద్యను ప్రవేశ పెట్టడం గొప్ప విషయం. దీని ద్వారా విభిన్న ప్రతిభావంతులైన చిన్నారులు సులువుగా అభ్యసన చేసే వీలుంటుంది.

– ఎంవీవీ సత్యనారాయణ, సహిత విద్య జిల్లా కోఆర్డినేటర్, అమలాపురం

నిరంతర పర్యవేక్షణ



సహిత విద్య అమలు విషయంలో నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నాం. విభిన్న ప్రతిభావంతులైన చిన్నారులకు అందించే సంక్షేమ కార్యక్రమాలు ప్రతి ఒక్కరికే అందేలా చర్యలు తీసుకుంటున్నాం. డిజిటల్ విద్యలో భాగంగా ట్యాబ్స్‌ను అందజేసి, విద్యాభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా దోహదపడుతోంది. ట్యాబ్స్ వినియోగంపై త్వరలోనే ఓరింటేషన్ నిర్వహిస్తాం.

– ఎం.కమలకుమారి, డీఈవో, అమలాపురం

జాతీయ లోక్ అదాలత్‌పై సమావేశం

పాల్గొన్న మూడు జిల్లాల ఎస్పీలు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా ప్రధాన న్యాయస్థాన ఆవరణలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత బుధవారం ఉమ్మడి గోదావరి జిల్లా పోలీసు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 9న జిల్లా వ్యాప్తంగా జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన ఎక్సైజ్ కేసులు, క్రిమినల్ కేసులు పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు ఇరు పక్షాల వారికి జాతీయ లోక్ అదాలత్‌పై తెలియజేసి వారి సమస్యలను రాజీ మార్గంలో పరిష్కరించుకునేందుకు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రత్యూష కుమారి, జిల్లా ఎస్పీ పి.జగదీష్, కాకినాడ జిల్లా ఎస్పీ ఎస్పీ పి.సతీష్ కుమార్, కోనసీమ జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్, ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా, జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఏఎస్పీ పి.సోమశేఖర్, ఎక్సైజ్ పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

నేడు జిల్లా మహిళా సమాఖ్య సమావేశం

సామర్లకోట: కాకినాడ జిల్లా పరిధిలోని జిల్లా మహిళా సమాఖ్య సమావేశం గురువారం స్థానిక టీటీడీసీలో జరుగుతుందని డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఐ.కాంచన అధ్యక్షత వహిస్తారన్నారు. జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన మండల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొంటారని తెలిపారు.

9న జాబ్‌మేళా

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక ప్రభుత్వ అటానమస్ కళాశాలలో ఈ నెల 9వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్రరావు బుధవారం తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెమినార్ హాల్‌లో విశాఖకు చెందిన నిర్మాణ్, ఆర్గ్ జాబ్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ డ్రైవ్‌లో నవత ట్రాన్స్‌పోర్ట్, ముత్తూట్ ఫైనాన్స్, పేటీఎం, అరబిందో ఫార్మా, డైకిన్ ఏసీ, హెటిరో లాబ్స్, హీరో మోటార్ కార్ప్, టాటా కాపిటల్ ఫైనాన్స్, శ్రీ రామ్ చిట్స్ అండ్ ఇన్సూరెన్స్, ఎస్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్, నియోలింక్ కంపెనీ, అపోలో ఫార్మసీ వంటి సంస్థలు పాల్గొంటున్నాయన్నారు. ప్రారంభ వేతనం రూ.12 వేల నుంచి రూ.20 వేల వరకు ఉంటుందన్నారు. రాజమహేంద్రవరం, విశాఖ, హైదరాబాద్, సూళ్లూరుపేట శ్రీ సిటీలలో ఉద్యోగాలు ఉంటాయన్నారు. 10వ తరగతి నుంచి ఎంఎస్సీ చదివిన ఆసక్తి గల విద్యార్థులు అర్హత ప్రమాణ పత్రాల నకళ్లతో పాటు, బయోడేటా ఫారంతో ఇంటర్వ్యూ కు హాజరుకావచ్చన్నారు. మరిన్ని వివరాలకు 73866 62879, 96852 18818 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఘనంగా హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవం



హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవంలో ప్రసంగిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

కాకినాడ క్రైం: కాకినాడలోని భానుగుడి పోలీస్ కన్వెన్షన్ హాలులో 61వ హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎస్పీ సతీష్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పోలీసుశాఖకు అనుబంధంగా హోంగార్డులు విశేష సేవలు అందిస్తున్నారని కొనియాడారు. శాంతిభద్రతల పరిరక్షణలో హోంగార్డు వ్యవస్థ ఎంతో కీలకంగా పనిచేస్తుందన్నారు. విజిలెన్స్, స్త్రీ శిశు సంక్షేమశాఖ, ట్రాన్స్‌పోర్టు, ఫైర్, సబ్‌జైలు తదితర సర్వీసుల్లో హోంగార్డులు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివన్నారు. హోంగార్డుల సంక్షేమాన్ని ప్రభుత్వం గుర్తించిందని, దశలవారీగా వారికి పలు అంశాల్లో ఆర్థిక సహకారాన్ని అందిస్తుందని తెలిపారు. భవిష్యత్‌లో హోంగార్డులంతా మరింత అంకిత భావంతో పనిచేసి జిల్లా పోలీసుశాఖకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఎస్పీ ఆకాంక్షించారు. అదనపు ఎస్పీలు శ్రీనివాస్, సత్యనారాయణ, ఏఆర్‌డీఎస్పీ వెంకటఅప్పారావు పాల్గొన్నారు.

మోటారు సైకిళ్ల దొంగ అరెస్ట్

- ఎనిమిది పోలీసు స్టేషన్‌ల పరిధిలో 11 బైక్‌ల చోరీ
- నిందితుడు వాడపల్లి వాసిగా గుర్తింపు
- చోరీ సొత్తు రికవరీ

కొవ్వూరు: అంతర జిల్లాల్లో మోటారు సైకిళ్ల చోరీలకు పాల్పడుతున్న కేసులో మండలంలోని వాడపల్లి గ్రామానికి చెందిన పంచదార నవీన్‌ను అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. నిందితుడి వద్ద 11 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో మూడు కేసుల్లో మూడు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. విచారణలో చోరీల చిట్టా బయటపడినట్లు ఆయన తెలిపారు. వివిధ జిల్లాల్లో ఎనిమిది పోలీసు స్టేషన్ల పరిధిలో నిందితుడు మోటారు సైకిళ్ల చోరీకి పాల్పడినట్లు తెలిపారు. తణుకు పోలీసు స్టేషన్‌కి సంబంధించి ఒకటి, రాజమహేంద్రవరం టూటౌన్ పరిధిలో రెండు, వన్ టౌన్ స్టేషన్ పరిధిలో ఒకటి, త్రీటౌన్ పరిధిలో ఒక మోటారు సైకిల్ చోరీకి పాల్పడినట్లు తెలిపారు. కోరుకొండ పరిధిలో ఒకటి, అనకాపల్లి టౌన్ స్టేషన్ పరిధిలో ఒకటి, విశాఖపట్నం హార్బర్ పోలీసు స్టేషన్ పరిధిలో ఒక మోటారు సైకిల్‌ను నిందితుడు చోరీ చేసినట్టు విచారణలో తేలిందన్నారు. నిందితుడి వద్ద 11 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందుతుడిని పట్టణ ఎస్సై బి.దుర్గాప్రసాద్ అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకి హాజరు పరిచినట్లు తెలిపారు.

అమ్మతనపు పాలన



తన పిల్లలతోపాటు మరో తల్లి పిల్లలకు కూడా పాలు ఇస్తున్న ఓ కుక్క

అమలాపురం /టౌన్: 'కంటేనే అమ్మ అని అంటే ఎలా...కరుణించే ప్రతి దేవతా అమ్మే కదా'ఓ సినిమాలోని పాటను గుర్తుకు తెచ్చింది ఆ శునకరాజం. స్థానిక వెత్సావారి అగ్రహారంలో కొద్ది రోజుల కిందట చెరో ఆరు పిల్లలకు జన్మనిచ్చిన రెండు వీధి శునకాలు రోజూ పలు చోట్లకు ఆహారానికి వెళ్లి తమ పిల్లలను సాకుతున్నాయి. అలా ఎప్పటి లాగే పిల్లలను వదలి ఆహారానికి వెళ్లిన ఆ శునకాలు మూడు రోజులుగా కురుస్తున్న కుండపోత వర్షాలకు తిరిగి పిల్లల వద్దకు చేరుకోలేకపోయాయి. తల్లి పాల కోసం అల్లాడుతున్న కుక్క పిల్లలను స్థానిక గో ప్రేమికుడు జక్కంపూడి శ్రీనివాసరావు, సీతాకుమారి దంపతులు స్పందించారు. సోమవారం అర్ధరాత్రి వాటిని తమ ఇంటికి తీసుకుని వెళ్లి అప్పటి నుంచి సాకుతున్నారు. పిల్లలను వెతుక్కుంటూ ఓ తల్లి కుక్క బుధవారం మధ్యాహ్నం వచ్చింది. రెండో కుక్క మాత్రం రాలేదు. దీంతో ఆ తల్లి కుక్క తన ఆరు పిల్లలకే కాకుండా, మరో తల్లి కుక్కకు చెందిన ఆరు పిల్లలకు కలిపి పాలు ఇచ్చి తన అమ్మతనాన్ని చాటుకుంది.

యువతి ఆత్మహత్య

యానాం: నియోజకవర్గ పరిధిలోని దరియాలతిప్ప బాలయోగినగర్‌కు చెందిన ఆర్ లక్ష్మీప్రసన్న(21) ఆదివారం మధ్యాహ్నం ఆమె స్వగృహంలో ఆత్మహత్యకు పాల్పడింది. ఘటనను గుర్తించి తెలియడంతో పోలీసులు ఆమె గృహానికి వెళ్లి మృతదేహాన్ని స్థానిక జీజీహెచ్‌కు తరలించారు. ఆత్మహత్యకు గల కారణాల వివరాలను సేకరిస్తున్నట్లు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శేరు నూకరాజు తెలిపారు.

సైనికా ...సలాం!



జిల్లా సైనిక సంక్షేమానికి విరాళం అందజేస్తున్న తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత (ఫైల్)

సైనికుల త్యాగనిరతిని స్మరించుకుందాం



దేశం కోసం ప్రాణాలు పణంగా పెట్టిన వీర సైనికులను, వారి కుటుంబ సభ్యుల త్యాగనిరతిని స్మరించుకునేందుకు త్రివిధ సాయుధ దళాల పతాక దినోత్సవం నిర్వహిస్తున్నాం. దేశసైనికుల చేసిన సేవలకు వెలకట్టలేం. తోచిన సాయం చేసి వారి కుటుంబాలకు మేమున్నామన్న భరోసా కల్పించడమే లక్ష్యం.

– కెప్టెన్ డాక్టర్ పి.సత్యప్రసాద్ (విశ్రాంత), జిల్లా సైనిక సంక్షేమాధికారి, తూర్పుగోదావరి జిల్లా

నేడు సాయుధ దళాల పతాక దినోత్సవం

రాజమహేంద్రవరం రూరల్: మాతృభూమి కన్నతల్లితో సమానం..భూమాత ఒడిలో ప్రజలందరూ ఎల్లవేళలా క్షేమంగా ఉండాలని దేశ సరిహద్దుల్లో నిరంతరం పహారా కాస్తున్నారు భారత సైనికులు. భరతమాత సేవకు జీవితం అంకితం చేస్తున్నారు. కుటుంబం, బంధుత్వాలు, సుఖాలకు దూరంగా ఉంటూ దేశరక్షణే లక్ష్యంగా తమ ప్రాణాలను సైతం పణంగా పెడుతున్న సైనికులంటే మనదేశంలో ప్రత్యేక గౌరవం ఉంది. ఇప్పుడు అటువంటి సైనికుల పట్ల మనకు ఉన్న గౌరవాన్ని చాటుతూ సైనికుల కుటుంబాలకు మేమున్నామంటూ తమవంతు చేయూతనిచ్చే అవకాశం వచ్చింది. అందుకే గురువారం ఫ్లాగ్ డే పేరుతో సాయుధ దళాల పతాక దినోత్సవం నిర్వహించుకుంటున్నాం.

దేశం కోసం ప్రాణాలను త్యాగం చేసిన అమరవీరులు, యుద్ధ సమయంలో అవయవాలను కోల్పోయిన వీరసైనికులకు బాసటగా నిలిచేందుకు సాయుధ దళాల వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. 1949 డిసెంబర్ 7న త్రివిధ దళాల పతాక దినోత్సవం నిర్వహించడం ప్రారంభించారు. అయితే 1993లో ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ఫ్లాగ్ డే ఫండ్ పేరుతో నిధిని ఏర్పాటు చేశారు. దేశరక్షణ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీ. అప్పటి నుంచి ఏటా డిసెంబర్ ఒకటి నుంచి ఏడవ తేదీ వరకు సాయుధ దళాల వారోత్సవాలు నిర్వహించి ఏడవ తేదీన ఫ్లాగ్‌డేగా ప్రజలు, సంస్థల నుంచి విరాళాలు సేకరిస్తారు. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ రంగాలకు చెందిన సైనికులు, వారి కుటుంబీకులు, వితంతవులకు చేయూతనిచ్చేందుకు విరాళాలను సేకరిస్తారు. విరాళాల ద్వారా వచ్చిన సొమ్మును అధికారుల ద్వారా వైకల్యం పొందిన మాజీ సైనికులు/వారి కుటుం సభ్యులు,వితంతువులకు అందజేస్తారు.

పతాక దినోత్సవం విశిష్టత..

దేశం కోసం తమ జీవితాలను త్యాగం చేసిన వీరజవాన్‌లను కాపాడటంలో నిరంతరం సేవలందించే సైనికులను గుర్తుచేసుకుంటూ వారి కుటుంబ సభ్యుల త్యాగనిరతిని స్మరించుకునే రోజే త్రివిధ సాయుధ దళాల పతాకదినోత్సవం , ఆరోజు విద్యార్థులు, ఎన్‌సీసీ కేడెట్స్ ప్రజలకు పతాకాన్ని అందించి హుండీ ద్వారా విరాళాలు స్వీకరిస్తారు. దీంతో పాటు ఆన్‌లైన్ ద్వారా కూడా విరాళాలను పంపవచ్చు. ప్రజలు ఎవరైనా మాజీ సైనికులకు చేయూతనివ్వదలిచిన వారు కాకినాడలోని జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో అందజేసి రశీదు పొందవచ్చు. డీడీ రూపంలో కానీ, నెఫ్ట్ ద్వారా కానీ జిల్లాసైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్, ఈస్ట్‌గోదావరి అండ్ కాకినాడ పేరుతో స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, జిల్లాపరిషత్ బ్రాంచ్, కాకినాడ, అకౌంట్ నంబర్ 62064060623, ఐఎఫ్ఎస్‌సీకోడ్ ఎస్‌బీఐఎన్0020974, ఎంఐసీఆర్ కోడ్ –533002028కు పంపవచ్చు. విరాళాలు ఇచ్చే వారికి సెక్షన్ 80జీ ఆదాయపు పన్ను చట్టం కింద పన్ను నుంచి మినహాయింపు ఉంటుంది.

దేశసైన్యంలో ఉమ్మడి జిల్లా ప్రాధాన్యం

దేశసైన్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు ప్రత్యేక స్థానం ఉంది. ఇప్పటికే వేలసంఖ్యలో సైన్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, కాకినాడ జిల్లా వాసులు పని చేయడం మన జిల్లాకు దక్కిన గౌరవం. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా త్రివిధ దళాల్లో 2,981 మంది మాజీ సైనికులు పనిచేసి ఉన్నారు. వీరిలో ఆర్మీలో 2059, ఎయిర్‌ఫోర్స్‌లో 666, నేవీలో 256మంది ఉన్నారు. వీరితోపాటు సైన్యంలో కుటుంబ సభ్యులను కోల్పోయిన వితంతవులు ఆర్మీలో 1,286 మంది, ఎయిర్‌పోర్స్‌లో 129మంది, నేవీలో 33మంది ఉన్నారు. వీరందరికి ప్రభుత్వం పరంగా పలు ప్రయోజనాలు లభిస్తున్నప్పటికీ వారి సేవలకు ఎంతచేసినా తక్కువే అన్నభావనతో పౌరులు స్పందించి తోచిన సాయం చేసి సైనికులకు వారి కుటుంబ సభ్యులకు భరోసా కల్పించే యత్నమిది.